క్లుప్తంగా

సప్తగిరి సంపాదకమండలి సభ్యుడిగా రామకృష్ణ


డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి నెలా ప్రచురించే ఆధ్మాత్మిక మాసపత్రిక సప్తగిరి సంపాదక వర్గంలోకి తనను తీసుకున్నట్లు నగరానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సప్తగిరి మాసపత్రిక సంపాదకుడు డాక్టర్ కె.రాధారమణ నుంచి ఉత్తర్వులు అందినట్లు పేర్కొన్నారు. రెండు సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డాక్టర్ రామకృష్ణ సప్తగిరి మాసపత్రిక ప్రచురణకు సంబంధించి అంశాల పరిశీలన, వ్యాసాల ఎంపిక తదితర విషయాల్లో కీలకమైన పాత్ర పోషించనున్నారు. విజయవాడ కేబీఎన్ కళాశాలలో తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రచురించిన తెలుగు పాఠ్య పుస్తకాలకు సంపాదకుడిగా పనిచేశారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. 40 పైగా పుస్తకాలు, 1000 పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని యువజన సర్వీసులశాఖ సహాయ సంచాలకులు నాగేశ్వరరావు సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల గురించి వాటి బారిన పడకుండా ఎలా ఉండాలో వివరించారు. అలాగే మానవ అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్ గురించి తెలియచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ, విజయలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.బాలకృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

సెలవులు సద్వినియోగం చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవటానికి కృషి చేయాలని 2వ డివిజన్ కార్పొరేటర్ నిర్మలకుమారి, 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. మాచవరం వాణీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం విన్నర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కేవలం విద్యకే పరిమితం కాకుండా నచ్చిన రంగంలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కూలు కరస్పాండెంట్ అంజూరి శేషుబాబు, ప్రిన్సిపాల్ ఏ ఝాన్సీ లక్ష్మీ మాట్లాడారు.

ఫార్మసీ విద్యార్థిని అనసూర్యకు అరుదైన గౌరవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ నాల్గవ సంవత్సరం చదువుతున్న తన్నీరు అనసూర్యకు అరుదైన గౌరవం లభించింది. చెన్నైకు చెందిన ఎడ్యువర్సిటీ అడ్మిషన్ ఎక్స్‌పో 2023 నిర్వహించిన జర్నీ టు ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ పోటీల్లో బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ ఇన్ ఫార్మసీ 2023 అవార్డును అందుకుంది. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 75 మంది విద్యార్థులు పోటీ పడగా అనసూర్యకు ఆ ఘనత దక్కింది. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, ఇతర అధ్యాపకులు అవార్డు పొందిన అనసూర్యకు అభినందనలు తెలిపారు.

పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సామాన్యుల బతుకుచిత్రం పూర్తిగా మారిపోయిందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ 253వ వార్డ్ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాతో కలిసి ఆయన 293 గడపలను సందర్శించి స్థానిక ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిలో కొన్నింటిని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు.

మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం....

స్థానికంగా పరిష్కారం కాని సమస్యల గ్రీవెన్సెస్ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం మే 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. స్పందన కార్యక్రమానికి ఇది మరింత మెరుగైన రూపమని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం 1902 హెల్ప్‌లైన్ నెంబర్ కూడా ఏర్పాటు చేశారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతి శనివారం 'హౌసింగ్ డే'... శుభపరిణామం...

గృహ నిర్మాణ రంగంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, ప్రతి శనివారాన్ని 'హౌసింగ్ డే'గా పరిగణించడం శుభపరిణామమని అన్నారు. ఆ రోజు అధికారులు తప్పనిసరిగా రెండు లేఅవుట్లను సందర్శించడం ద్వారా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు.

చంద్రబాబు పీ4 స్ట్రాటజీ ఒక పెద్ద మాయ...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా పాలన చేస్తూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తుంటే చంద్రబాబు, పచ్చ నాయకులు ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబు చెబుతున్న పీ4 స్ట్రాటజీ కూడా విజన్-2020 మాదిరిగానే ఒక పెద్ద మాయ అని విమర్శించారు. రజినీకాంత్‌ను పక్కనపెట్టుకున్నా, మరోసారి మోదీ జపం చేసినా 2024లో చంద్రబాబు ఘోర పరాజయం పాలవడం ఖాయమని స్పష్టంచేశారు. కార్పొరేషన్ సీఎంఓహెచ్ రత్నావళి, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు సందెపు సురేష్, ఎండీ హాఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, కంభగళ్ల రాజు, పిరాట్ల వేణుగోపాల్, కృష్ణ, నేరెళ్ల శివప్రసాద్, అమిత్, రాజు, నాయక్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు


టీడీపీ నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై రాష్ట్ర ప్రజలంతా పూర్తి విశ్వాసంతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి నూతన ప్రభంజనాన్ని సృష్టించడం తథ్యమని ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు కిరణ్‌తో పాటు 20 మంది టీడీపీ సభ్యులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పథకాలు, ఆయన మంచి మనసు చూసి అన్ని వర్గాల ప్రజలతో పాటు అన్ని పార్టీల నాయకులు కూడా జగనన్నకు అభిమానులుగా మారుతున్నారన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలతో పాటు పార్టీలను కూడా చూడకుండా సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం జగనన్నే అని చెప్పారు. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలోకి చేరడం సంతోషంగా ఉందని, పార్టీని నమ్ముకున్న ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో 64వ డివిజన్ కండ్రిక ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేళం చిన్నా, 50 మంది కాంగ్రెస్ పార్టీ సభ్యులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. భవానీపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తదితరులు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు చర్యలు

కలెక్టర్ ఢిల్లీరావు


విద్యార్థినులకు మాత్రలను అందిస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో రక్త హీనత నివారించేందుకు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా అందించాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. పటమటలంకలోని కేఎస్ఆర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో రక్తహీనత తగ్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విద్యాసంస్థలకు దాదాపు 45 రోజుల పాటు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో మాత్రల వాడకం నిరంతరం జరగాలని, ఆరు వారాలకు సరిపడా మాత్రలు తల్లిదండ్రులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యానికి కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సి. రేణుక మాట్లాడుతూ జిల్లాలో 728 పాఠశాలల్లో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి 13,491 మంది విద్యార్థులకు మైల్డ్, 15,648 మంది విద్యార్థులకు మోడరేట్, 129 మంది విద్యార్థులకు సివియర్ రక్తహీనత ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. వేసవి సెలవుల్లో వినియోగించేలా ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి. మాధవి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎల్ఎన్ కుమార్, డెప్యూటీ డీఈవో కొండ రవికుమార్, ఎస్‌పిహెచ్‌వో నరసింహానాయుడు, పీహెచ్‌సీ డాక్టర్ మొబిన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. పద్మ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి నిబద్ధతతో కృషి


స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయటానికి తాము నిబద్ధతతో కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 18 అంశాలు ఎజెండాలోకి రాగా అందులో 16 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరొకటి ర్యాటిఫై చేశారు. స్థాయీ సంఘం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


సాయినాథ్‌శ్రీమంత్ 10వ ర్యాంకు


ఎస్.ధరమ్‌తేజ్ రెడ్డి-42వ ర్యాంకు


వెంకట యోగేష్ -43వ ర్యాంకు


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్-2023 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఆలిండియా ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఈజీఎం ఎం.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరిలో ఆలిండియాలో మొదటి నుంచి పది ర్యాంకులతో పాటుగా 100లోపు 23 ర్యాంక్‌లు తమ విద్యాసంస్థ కైవసం చేసుకుందని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో విజయవాడ నగరానికి చెందిన కె.సాయినాథ్‌శ్రీమంత్ 10వ ర్యాంకు పొందారని తెలిపారు. వంద లోపు 9 ర్యాంకులు, 200 లోపు 19 ర్యాంకులు, 500 లోపు 37 ర్యాంకులు, 1000 లోపు 65 ర్యాంకులు పొందారని తెలియజేశారు. ఈ విజయాలు ఒక్క విజయవాడ శ్రీచైతన్య విద్యార్థులవేనన్నారు. ఇంతటి ఘన విజయం మరే ఏ ఇతర విద్యాసంస్థలకు రాలేదని తెలిపారు. అపూర్వ విజయాన్ని సాధించడంలో దోహదపడిన విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బీఎస్.రావు, అకడమిక్ డైరెక్టర్ సుష్మతో పాటుగా విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్స్ పి.వెంకటేశ్వరరావు, పి.మురళీరావు, కె.శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

సాహిత్యం దశ దిశను మార్చిన మహాకవి శ్రీశ్రీ


పద్యపఠన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆధునిక తెలుగు సాహిత్యం దశ దిశను మార్చిన మహాకవి శ్రీశ్రీ అని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ పథంలో నడిపించేలా సాహిత్యాన్ని సృష్టించిన యుగకర్త శ్రీశ్రీ అని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యం అనితర సాధ్యమని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన రిటైర్డ్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్-ప్రొహిబిషన్ డిపార్ట్ మెంట్ అధికారి మామిళ్ళపల్లి ఆదిశేషు, ఎంఏ తెలుగు పీజీ విభాగాధిపతి డాక్టర్ కే.ఆర్.జి.శేషుకుమార్, డాక్టర్ వై.శ్రీలత మాట్లాడారు. విద్యార్థుల్లో పద్య సాహిత్యం పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులకు పద్యపఠనం పోటీలను నిర్వహించేందుకు ప్రోత్సాహకంగా రూ.20 వేలు నగదును విరాళంగా అందించిన కలెక్టరు ఎస్. ఢిల్లీరావును సత్కరించారు. అనంతరం పద్యపఠన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సూపరింటెండెంట్ ఉమామహేశ్వరి, అధ్యాపకులు డాక్టర్ అనిత, ముప్పా పద్మనాభం, డాక్టర్ కే.రమేష్, డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ తదితరులు, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని తేజా ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు అన్నారు. గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సాంస్కృతిక మహోత్సవాలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ తేజా ఆర్ట్స్ సంస్థ ద్వారా ఏటా వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల సామాజిక సేవలను గుర్తించి వారికి పురస్కారాలను, పేద కళాకారులను గుర్తించి వారికి ఆర్థిక సహాయం చేస్తునట్లు తెలిపారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. ఐక్య కాపునాడు అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు, గాయని సయ్యద్ రేష్మ, నగరపాలక సంస్థ హార్టీకల్చరల్ ఏడీహెచ్ చొప్పర శ్రీనివాసులును ఆత్మీయంగా సత్కరించారు.

నటరాజుకు నాట్య వినోదం..

ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం, నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ శత జయంతి తుమ్మపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. వందలాది మంది కళాకారులు చేసిన నృత్యాలు మనోహరంగా సాగాయి. మంత్రులు రోజా, అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


పుస్తకావిష్కరణలో మంత్రులు రోజా, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, లక్ష్మీ పార్వతి తదితరులు

నృత్య కళాకారులతో మంత్రి రోజా



నేడు ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో ఆర్యన్ రీనల్ కేర్ ఆధ్వర్యాన ఆదివారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ పవన్‌సాయి పోతుల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. బ్లడ్ షుగర్, సీరమ్‌క్రియాటిన్, బీపీ, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన వడ మాలలను నైవేద్యంగా సమర్పించి సింధూరం ఆకు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.


రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన కీర్తనలు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో నాదబ్రహ్మ సద్గురు త్యాగరాజ స్వామి 256 జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు రామభక్తి సామ్రాజ్యాన్ని చాటాయి. శనివారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారులతోపాటు, సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి విరచిన కీర్తనలు గానం చేశారు. సంగీత విద్వాంసులు కస్తూరి గోపాలరావు, మోదుమూడి సుధాకర్, సీవీపీ శాస్త్రి, మల్లాది కార్తీక త్రివేణి, మల్లాది యమునా రామన్, యువ సంగీత కళాకారులు అమ్మా సాంస్కృతిక కేంద్రం విద్యార్థులు, ఇలపర్తి అదితి, కంభంపాటి జయలక్ష్మి, నాదావఝుల భార్గవి, చినముత్తేవి సంజన, గండూరి సాయి కృష్ణ, నాదార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. పొరుపల్లి ఇఖాన్, గాయత్రి నాగుల్ మీరావలి, చావాలి కృష్ణ మోహన్ వాద్య సహకారం అందించారు. శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, కార్యదర్శి గౌరీనాథ్ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు

మధురానగర్: బుడమేరులో గుర్రపు డెక్క తొలగింపు పనులు వేగవంతం చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బి. జానారెడ్డి, నగర పాలక సంస్థ బయాలజిస్టు డి.సూర్యనాయక్ సూచించారు. దావు బుచ్చయ్యకాలనీ సమీపంలో గుర్రపుడెక్క తొలగింపు పనులు శనివారం పరిశీలించారు.

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి




కీ.శే. కుందూరు కృష్ణయ్య గారు
వ్యవస్థాపకులు శ్రీ సూర్య కాఫీ & జనరల్ స్టోర్స్
బీసెంట్ రోడ్, విజయవాడ.
శ్రీ కుందూరు కృష్ణయ్య గారి
కొండవీడు అకాడమీ - భవానీపురం
గంటా రామచంద్రారెడ్డి, చైర్మన్
రెడ్డెం నారాయణరెడ్డి, అధ్యక్షులు
శీలం మురళీధర్‌రెడ్డి, సెక్రటరీ
సోముల చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి


ద్వితీయ వర్ధంతి



Retired Union Secretary, Work Inspector, Vijayawada Municipal Corporation



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.



అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com